క్లుప్తంగా

రిమ్స్ అన్నపూర్ణకు రూ.10వేలు విరాళం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు రూ.10 వేలను గురువారం విరాళంగా అందించారు. ఖమ్మంకు చెందిన గండి జయలక్ష్మి తన భర్త గండి కృష్ణ జ్ఞాపకార్థం సెక్రటరీ కిల్లా ఫల్గుణరావుకు లోకనాథం రామారావు ద్వారా అందచేసినట్టు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షులు గంగుల రమణబాబు, రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు అభినందనలు చెప్పారు.

విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్‌ఐ రాము

శ్రీకాకుళం రూరల్: సింగుపురంలోని క్రాంతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ కనబర్చడంతో శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ రాము చేతుల మీదుగా గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ జి.అమ్మడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



సరుకులు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రొమ్ము క్యాన్సర్ లక్షణాలపై సందేహం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని గైనకాలజిస్టు కింజరాపు ప్రశాంతి అన్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో బాలికల వసతి గృహంలో తన తల్లి కింజరాపు ఉమారాణి జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు వితరణగా అందించారు. అనంతరం బాలికలకు బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తగా ఇంజెక్షన్ రెండో డోసు వేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, కమిటీ సభ్యులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరులో వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

రణస్థలం: లావేరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లంకలపల్లి గోపి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి 230 మంది హాజరయ్యారు. వీరిలో 20 మంది కంటి ఆపరేషన్, 30 మంది పలు శస్త్ర చికిత్సల నిమిత్తం ఎంపిక చేశారు. మిగతా వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మిమ్స్ వైద్యులు, సర్పంచ్ లక్ష్మి, గ్రామ పెద్దలు లంకలపల్లి మహేష్, ఎంపీటీసీలు రాధా, ఇనపకుర్తి సతీష్, ఉప సర్పంచ్ దామోదర్, లావేరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ



మాట్లాడుతున్న డైరెక్టర్ రామకిశోర్

ఎచ్చెర్ల : స్థానిక శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా కెరీర్ గైడెన్స్, సాఫ్ట్‌స్కిల్స్, లేటెస్ట్ ఎమర్జెన్సీ టెక్నాలజీపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సు గురువారంతో ముగిసింది. డీఎస్‌ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రామకిశోర్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాక్ ఇంటర్వ్యూలు చేయించారు. లోకల్, గ్లోబల్ ప్లేస్‌మెంట్ అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు, హెచ్.సత్య, తిరుమలరావు, ఎం.ఉదయకుమార్, భాస్కరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గురువుకు సత్కారం



విశ్వనాథంను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

ఎచ్చెర్ల : లావేరు మండలం పాతకుంకాం గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణ ఆధ్యాత్మిక (భగవద్గీత) బోధన గురుస్వామి వైదా విశ్వనాథంను నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పాతకుంకాం పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక బోధనలు వినిపిస్తున్న గురుస్వామిని సత్కరించడం ఆనందంగా ఉందని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రొంపివలస మల్లేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్ ప్రారంభానికి..
మోక్షమెప్పుడో?

- గత ప్రభుత్వ హయాంలో రూ.3.68 కోట్లుతో భవన నిర్మాణం
- పరికరాలు, సిబ్బంది నియామకంపై దృష్టి పెట్టని కూటమి ప్రభుత్వం



అంపోలు పరిధిలో నిర్మాణం పూర్తయిన జిల్లా స్థాయి అగ్రిల్యాబ్



మెట్ల మార్గం వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గార : రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందాలన్న ఉద్దేశ్యంతో, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రతి నియోజకవర్గ కేంద్రంతో పాటు జిల్లా స్థాయిలోనూ ల్యాబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గంలోని గార మండలం అంపోలు పరిధిలో జిల్లా స్థాయి అగ్రిల్యాబ్ నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ నిర్మాణ శాఖ ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించి రూ.3.68 కోట్లు మంజూరు చేశారు. భవనం ప్రారంభమయ్యే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో కార్యక్రమం నిలిచిపోయింది. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం పరికరాలు, సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి ఉన్నా జిల్లా ల్యాబ్‌పై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యమైన సేవలు అందేనా..

ప్రభుత్వం, ప్రైవేటు దుకాణాల్లో సరఫరా చేసే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు సరఫరా, అమ్మకాలు జరిగే వీటిని వ్యవసాయశాఖతో పాటు విజిలెన్సు అధికారులు ర్యాండమ్‌గా శాంపిల్స్ సేకరిస్తుంటారు. వీటితో పాటు రైతు తీసుకొచ్చిన శాంపిల్స్‌ను జిల్లా అగ్రిల్యాబ్‌లో తనిఖీలు చేసే వీలు కలుగుతుంది. ఇప్పటివరకు అధికారులు పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాలోని ల్యాబ్‌లకు పంపిస్తుండగా, రైతులు అంతదూరం శాంపిల్ తీసుకెళ్లినా ఫలితాలు ఆలస్యంగా రావడం, ప్రయాణ ఖర్చులు, సమయం వంటివి సాగుకు ఇబ్బందిగా పరిణమించాయి. జిల్లా అగ్రిల్యాబ్‌లో నకిలీవి అని తేలితే ఫెర్టిలైజేషన్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సీఓ) ప్రకారం కేసు నమోదు చేస్తారు. ముందుగా ఆయా విత్తనాలును కిందిస్థాయిలోనే అమ్మకాలు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకుంటాది. దీనివల్ల నాణ్యమైన విత్తనాలను పంట విత్తే సమయంలో రైతులు వేయవచ్చు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాడిన తర్వాత తెలిసినా, అన్నదాతలకు సమయంతో పాటు డబ్బులు నష్టపోతారు. దీన్ని అధిగమించేందుకు జిల్లాలోనే నాణ్యమైన సేవలందేలా గత ప్రభుత్వం వీటికి రూపకల్పన చేసింది. అన్నదాతకు ప్రాముఖ్యత కలిగిన సేవలపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. ల్యాబ్‌కు డీడీ స్థాయి అధికారి, ముగ్గురు ఏడీ, ముగ్గురు ఏవోలు, పరీక్షలు జరిపే సిబ్బందిని నియామకం చేపట్టాల్సి ఉంది. పరికరాలు కొనుగోలుకు దృష్టి సారించాల్సి ఉంది.

ప్రారంభించాలి..



జిల్లా అగ్రిల్యాబ్‌ను అధికారులు త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు సదుద్దేశంతో నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది పూర్తయినా ఇంతవరకు ల్యాబ్ ప్రారంభంపై ఆలోచన చేయకపోవడం సరికాదు.

– గొండు రఘురామ్, ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, గార

స్పందించాలి..



జిల్లా వ్యవసాయ ల్యాబ్ ప్రారంభించడం వల్ల రైతులకు మేలు జరుగుతోంది. ఇక్కడే మట్టి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంటుంది. జిల్లా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారిక మందులు అందుబాటులోకి వస్తాయి. నకిలీ విత్తనాలు, పురుగుమందులకు చెక్ పడుతుంది.

– శిమ్మ ధర్మరాజు, మాజీ సర్పంచ్, గొంటి

సౌత్‌జోన్ నేషనల్స్‌కు 13 మంది అథ్లెట్స్ ఎంపిక



హైజంప్ సాధనలో ఓ అథ్లెట్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక సౌత్‌జోన్ నేషనల్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు జిల్లా నుంచి 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి 28 వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. ఇటీవల బాపట్ల జిల్లా చీరాల వేదికగా జరిగిన ఏపీరాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంయన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అథ్లెట్స్ ప్రాతినిధ్యం వహించారు. ఇందులో జిల్లా క్రీడాకారులు 25 పతకాలతోపాటు అండర్–14 విభాగంలో చాంపియన్‌షిప్ కైవశం చేసుకున్నారు. అండర్–14,16, 18,20 వయో విభాగాల్లో రన్స్, త్రోస్, జంప్స్‌లో 13 మంది క్రీడాకారులు సౌత్‌జోన్ నేషనల్స్‌కు ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా జిల్లా నుంచి సౌత్‌జోన్ నేషనల్స్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన వారి జాబితాను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు, నౌపడ విజయ్‌కుమార్, అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి వెల్లడించారు. ఎంపికైనవారిలో వి.రాజేష్ (200,400 మీటర్ల పరుగు), టి.తరుణ్ (జావెలిన్ త్రో), బి.వెంకటలక్ష్మి (3000 మీటర్ల పరుగు), బి.హారిక (ట్రిపుల్‌జంప్), ఎం.శృతి (1000 మీటర్ల రేస్‌వాక్), అండర్–18 విభాగంలో కె.మధన్‌యాదవ్ (షాట్‌పుట్), మౌనిక మిశ్రా (లాంగ్‌జంప్), ఎల్.కల్పన (హైజంప్), ఎం.మోహిణి (జావెలిన్‌త్రో), అండర్–16 విభాగంలో పి.యశ్విత (హైజంప్), అండర్–14 విభాగంలో టి.విష్ణువర్ధన్ (కిడ్స్ జావెలిన్), ఆర్.పవిత్ర (ట్రిథిలిన్), టి.హిమాన్సుజా (కిడ్స్ జావెలిన్‌త్రో) ఉన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిరమండలం: జీడీమామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరమని ఉద్యానశాఖ హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త టి.రాజశేఖర్ అన్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని కారిగూడ గిరిజన గ్రామంలో చైతన్య పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉద్యానశాఖ అధికారులు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీడీ తోటల్లో క్షేత్ర సందర్శన చేసి రైతులకు దోమ, కాండం తొలుచు పురుగు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ అవంతికుమారి, పీసీఓ గోపాల్, హెచ్ఈఓ తిరుపతిరావు, వీపీఏ శ్యామల, ఎఫ్‌పీఓ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

'ఎరువుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుల ఎరువుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్‌లో పలువురు రైతులు తమ సమస్యలను వివరించారు. వాటిని సంబంధిత మండల వ్యవసాయాధికారులకు చేరవేస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన చంద్రరావు, ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కొండబాబు, గార మండలం తండ్యాలపేట గ్రామానికి చెందిన గొల్ల భాస్కరరావు, కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన పి.గజపతిరావుతో పాటు పలువురు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోన్‌లో నేరుగా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు చెప్పారు. ఎవరికైనా సమస్యలు ఉంటే 08942222565, 08942222648 నంబర్లకు కాల్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి



డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ డీపీటీవో కార్యాలయంలో డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు సమస్యలను ఫోన్ ద్వారా వివరించారు. టెక్కలి నాలుగు రోడ్ల కూడలి ఇందిరాగాంధీ బొమ్మ వద్ద పల్లె వెలుగు బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్నాయని, పలాస నుంచి సువ్వులరేవుకు అదనపు ట్రిప్పులు నడపాలని, మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు తర్వాత పురుషులకు బస్సుల్లో సీట్లు లేకుండా పోతున్నాయని, పల్లెవెలుగు బస్సులను రిక్వెస్ట్ స్టాపుల్లో ఆపడం లేదని, శ్రీకాకుళం నుంచి టెక్కలి మార్గంలో బస్సుల సంఖ్యను పెంచాలని తదితర ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు హనుమంతు అమరసింహుడు, కెఆర్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణకు డాక్టరేట్



శివరామకృష్ణను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

ఎచ్చెర్ల : స్థానిక రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ డీన్ ఆఫ్ అకడమిక్స్ శివరామకృష్ణ ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) రూర్కీ నుంచి డాక్టరేట్ పట్టా (పీహెచ్‌డీ) అందుకున్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో 'ఇన్వెస్టిగేషన్ ఇన్ ఎలక్ట్రికల్ మిషన్ డ్రైవ్ పాల్ట్స్' అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్.జీవానంద్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం ఈయన ఆర్‌జీయూకేటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, డీన్ ఆఫ్ అకడమిక్స్‌గా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా శివరామకృష్ణను రిజిస్ట్రార్ సండ్ర అమరేంద్రకుమార్, డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలనాధికారి డాక్టర్ మునిరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, డీన్ వెల్ఫేర్ రవి, మోహనకృష్ణ చౌదరి, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది గురువారం అభినందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని, క్రీడలతో చురుకుదనంతో పాటు ఉత్సాహం లభిస్తుందని జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపక అధ్యక్షుడు జామి భీమశంకరరావు అన్నారు. జేసీఐ వారోత్సవాలలో భాగంగా నగరంలోని విద్యాధరి డిగ్రీ కళాకళాశాలలో యోగాపై అవగాహన కల్పించారు. యోగా గురువులు బిందు మాధవి, రమాదేవి యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ పోలుమహంతి శ్రీకాంత్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ తమ్మినేని ఉషారాణి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు కృష్ణకాంత్, స్వాతి, కోరాడ రమేష్, మణిశర్మ, జగదీష్, సంజయ్, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

డీపీటీవోను కలిసిన ఈయూ నూతన కమిటీ



డీపీటీవో అప్పలనారాయణతో నూతన కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నానాజీ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. తాము కూడా ఆర్టీసీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. డీపీటీవోను కలిసిన వారిలో ఈయూ నూతన అధ్యక్ష, కార్యదర్శులు కె.దశరథుడు, జి.త్రినాథ్, కార్యవర్గ ప్రతినిధులు కె.బాబూరావు, బి.టి.వి.శ్రీనివాస్, బి.ఎ.రావు, ఎస్.జోగారావు, బి.ఎం.ఎం.రావు, పి.వి.ఆర్.ఎల్.కుమారి, వై.కె.కుమార్, డి.వనజాక్షి, ఎం.సురేష్, పి.ఎస్.కుమార్, వి.డి.రావు, సనపల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్:

క్రీడారంగం, ఆరోగ్యం, దినచర్యలపై యువతకు అవగాహన కల్పించి వారికి మార్గదర్శకులుగా నిలుస్తామని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షుడు సింగూరు ప్రవీణ్ అన్నారు. జేసీఐ ఆధ్వర్యంలో ప్రిజం 110, జేసీఐ వీక్‌లో భాగంగా కోచ్ దేవీప్రసాద్ మార్గదర్శకత్వంలో గురువారం పీఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో జుంబా సెషన్ నిర్వహించారు. 80 మందికి పైగా హాజరై ఉత్సాహంగా వ్యాయామాలు చేశారు. అనంతరం ఏడు రోడ్ల కూడలిలోని హేమంత్ మార్షల్ అకాడమీ వద్ద జూనియర్, సీనియర్ విభాగాలలో కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు కె.శ్రీనివాస్, దామోదర్, ప్రవీణ్ కుమార్ బగాది, డాక్టర్ వినోద్‌కుమార్ కుర్మాన, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు వాటర్‌ప్లాంట్ వితరణ

గార: వమరవల్లి బాలిక గురుకుల పాఠశాలకు వైద్యులు దానేటి శ్రీధర్ రూ.లక్ష విలువైన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. గురువారం ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మెమో 57 అమలు చేయాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం రూరల్/గార: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో 57ను అమలు చేయడం ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని 2003 డీఎస్సీ ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం తాలూకా కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు దుప్పల శివరాంప్రసాద్, గురుగుబెల్లి భాస్కరరావు, సీర రమేష్‌బాబు, గురువు గోవిందరావు, కూన లోకనాథం, కిల్లి శ్రీనివాసరావు, అన్నెపు పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన చేపడుతున్న ఉపాధ్యాయులు

గార: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్–257 పిలుపు మేరకు పాఠశాల విరామ సమయంలో ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. పీఆర్‌సీ ఏర్పాటు, మూడు డీఏలు విడుదల, పెండింగ్ బకాయిలు విడుదల, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం, పని ఒత్తిడి నుంచి మినహాయింపు, సీపీఎస్ రద్దుతో పాటు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్–257 మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గురువు గోవిందరావు, చిట్టి త్రినాధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షిరిడీసాయికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం సాయి దర్బార్‌లో షిరిడీ సాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామికి ఉదయం కాగడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది.

విజయ గణపతికి విశేష అలంకరణ



బలగ హరేరామ మందిరంలో పూజలు



అలంకరణలో విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో సంకష్ట హర చతుర్థి పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. బలగ హరేరామ మందిరంలో సంకష్ట హర చతుర్థి పురస్కరించుకొని అర్చకులు చెరువు నారాయణరావు ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



జి.సిగడాం మండల కేంద్రం సమీపంలో భారీ గొయ్యి



చెరువును తలపిస్తున్న రోడ్డు

జి.సిగడాం : మండల కేంద్రం జి.సిగడాంకు వచ్చే రహదారులు అధ్వానంగా మారాయి. జి.సిగడాం–పాగిరి గ్రామాల సమీపంలో అడుగడుగునా గోతులు ఏర్పడటంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ గోతులు గమనించక వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మండల సర్వ సభ్య సమావేశం నేడు

రణస్థలం : రణస్థలం మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.మార్కండేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పిన్నింటి రజినిసాయి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.